
# కలల మనిషి





సమయం ఏడున్నర.

గది నిండా లేత వెలుగు. ప్రవాహంలా శబ్దాలు. లేచి కిటికీలు, తలుపులు గట్టిగా బిగించి, ప్రపంచం నుండి తనను, తన గదిని వేరు చేశానని తృప్తిగా నిట్టూర్చాడు సత్యప్రకాశం. తలుపులు, కిటికీలు వేశాక, గదిలో తను కాక మరో ప్రాణి కూడా ఉన్నట్టనిపించింది. బొయ్ బొయ్ మంటూ తిరుగుతున్న ఫాను. ఫాను తాకిడికి రెపరెపమంటున్న పుస్తకం, శరీరంపై నిర్లజ్జగా ప్రయాణిస్తున్న దోమ, నలిగి ముడతలు పడి చాలా యేళ్ళుగా శవాలపై కప్పడానికి వాడుతున్న గుడ్డలా ఉన్న దుప్పటి - ఇవేమి కాదు. మరింకేదో. అసహనంగా కదిలాడు సత్యప్రకాశం. సొరుగులో ఉన్న గాజుసీసా. దూదితో, గాజుగుడ్డలో చుట్టిన చిన్నమూట గుర్తుకొచ్చింది. ఊపిరి ఆగిపోయినట్లుగా, భయమో, వణుకో - తెరచి చూడాలని కోరిక. 'ఉహూ! ఇప్పుడు కాదు. ఇంటిలో మనుషు లందరూ వెళ్ళిపోవాలి" అనుకొన్నాడు.

అతని రాత్రులన్నీ కలత కలతగానే గడిచిపోతాయి. బలంగా లోపలికి దిగబడిన బాకులా, ఒక భీకరమైన కల - అతని రాత్రిని అంటిపెట్టుకొనే ఉంటుంది. మెలకువలోకి కూడా ప్రయాణించి, లోలోపల కుళ్ళిపోతూ ఉంటుందా కల. ఉదాహరణకు, రాత్రి వచ్చిన కల అతని శరీరం హఠాత్తుగా కుంచించుకుపోవటం మొదలుపెట్టింది. "హనీ! ఐ ష్రంక్‌డ్ మై బాడీ" అంటూ ఇంగ్లీషు పాటేదో హమ్ చేస్తుండగా, అతని యాభైయేళ్ళ ముసలి కొవ్వు పట్టిన శరీరం, మూడు నెలల శిశువు శరీరంలా మారి - "శిశువు కాదు పిండం. ఫీటస్!" వెనుకనుండి ఎవరో అరుస్తున్నారు. "ఇంతకీ ఆ పిండం బతికి ఉన్నట్టా? చచ్చినట్టా?" ఆ గొంతు అతనిదే, శిశువు నిర్జీవంగా గాలిలో తేలుతూ- "శిశువు కాదు. ఫీటస్. చచ్చినది" మళ్ళీ అరుస్తున్న గొంతు. అరుపుల మధ్య మెలకువ వచ్చింది. నిస్సత్తువ, దుఃఖం, అపరాధభావం. అతని ఉదయాలన్నీ ఇట్లాగే ఉంటాయి.

నిజానికి ఇవాళ అతను చాలా సంబరంగా ఉండాల్సిన రోజు. నిన్నటి నుంచి అతన్ని "శుభోదయం" వారపత్రికకు ఎడిటర్‌గా చేశారు. శుభోదయం వారపత్రిక. ఎడిటర్ సత్యప్రకాశం. మాస్ట్‌హెడ్ కింద అతని పేరు. దేశమంతా చదువుతుంది.

ఇంటర్‌నెట్‌లో చొరబడి అతని పేరు గ్లోబల్ విలేజి మొత్తం పాకుతుంది. సంబరంగా ఉండాల్సిన విషయమే. కానీ అపశకునాల్ని సూచించే తీతువు కూత ఉండీ ఉండీ మోగుతుంది. నొప్పిగానీ, ఆనందంగానీ తెలియని తనం, శరీరంలోకి ప్రవేశించినట్లు, గొప్ప ఆనందమేదీ కలగడం లేదు.

బయట, గది అవతల ఇట్లాంటివే చాలా గదులు. చాలాసేపటి క్రితమే మేలుకొని చప్పుడు చప్పుడుగా ఉన్నాయి.

పెద్దపెద్దగా 'వి' ఛానల్ కేకలు. కేకల మధ్య సన్నని ఈలపాట. కొడుకు సుందరం గది. రేబాన్ గ్లాసలు, డెనిమ్ జీన్స్, చిల్డ్ బీరు, పబ్‌లు, కళ్ళల్లో బ్లూ ఫిలిమ్ రీళ్ళు, ఏమిట్రా యిదంటే 'జస్ట్ ఫన్' అంటూ కన్ను గీటుతాడు. హీరో హోండా. వీపుపై క్యారీ బ్యాగు. పెంటియమ్, కోబాల్, ఐబియమ్, ఎప్పుడూ కంప్యూటర్ భాషే మాట్లాడతాడు. బాక్‌పాకెట్‌లో పాస్‌పోర్టు, వీసా అప్లికేషన్. అమెరికా నా చివరి గమ్యం అంటాడు.

నిన్న రాత్రి పబ్‌లో గొడవైంది. కత్తితో అతనిపైకి దూకాడో యూనివర్శిటీ కుర్రాడు. చేతిపై గాయం. అడ్డుగా వెళ్ళిన సుందరం గర్ల్‌ఫ్రెండు చెంపపై అంగుళం లోతుకు దిగబడింది కత్తి. రక్తంతో తడిసి ముద్దయిన ఆ అమ్మాయిని ఇంటికి తెచ్చాడు సుందరం.

సత్యప్రకాశం భయంతో బిగుసుకుపొయ్యాడు. "లేనిపోని లంపటం. పోలీసులు, కోర్టులు, ఇంటిపై రౌడీల దాడి. ఆ పిల్లను రోడ్డుపై వదిలేసిరా." అన్నాడు. "ఫో! ఫో!" ఆ పిల్లను కసిరాడు. రోషంతో ఆ పిల్ల బయటకు వెళ్ళిపోయింది. ఇంటి మధ్య రక్తపు మరక. బకెట్ నీళ్ళు తెచ్చి గుమ్మరించాడు. కొడుకు కోపంగా అన్నం కూడా తినకుండా గదిలోకి వెళ్ళాడు.

మరో గది అతని భార్య సుశీలది. ఆ గది ఎప్పుడూ ఈసురోమంటుంది. ఆవిడకు రొమ్ము కేన్సరని చాన్నాళ్ళు భయపడ్డారు. ఆపరేషన్ చేసి రొమ్ము తొలగించాల్సి వస్తుందనుకొన్నారు. ముక్క తీసి పరీక్ష చేసినాక పెద్ద ప్రమాదమేదీ లేదని తేల్చారు. మామూలు గడ్డే అన్నారు. కానీ సత్యప్రకాశానికి మాత్రం ఆవిడో భయం గొలిపే కేన్సర్ క్రిమిలా కనబడుతుంది.

ఆ గదిలోకి వెళితే గది పొడవునా కొక్కేలు తగిలించి, ఆ కొక్కేలకు కోసిన స్తనాలు వేళ్లాడదీసినట్లుగా తోస్తుంది. ఆ గది చాన్నాళ్ళపాటు అతని కలల్లోకి వచ్చేది. ఒకటే కల – పదేపదే వచ్చేది. అతని భార్య ఆఫీస్ నుంచి వస్తూనే, అలసటగా వస్తుంది. వచ్చి స్తనాలు రెండూ గోడకు తగిలించి, స్నానానికి వెళుతుంది. స్నానం అయినాక, తాపీగా స్తనాలు చేతుల్లోకి తీసుకొని సోప్‌తో బ్రష్ చేసి, స్ప్రే చల్లి, ఫ్రిజ్‌లో పెడుతుంది. రాత్రి ఎప్పుడో మంచినీళ్ళ కోసం

ఫ్రిజ్ తీస్తే, అక్కడ నునుపుగా, పాలరంగులో మిలమిలలాడుతూ - కెవ్వున కేక వేస్తాడు. భార్యను చూసినప్పుడల్లా అతనికి ఈ కలే గుర్తుకొస్తుంది. ఎప్పుడన్నా ఒంటరి రాత్రుల్లో, మల్లెపూలు, మంచి చీర, వెచ్చని మూడ్‌లో ఆవిడ అతని గదిలోకి వస్తే వెంటనే లైట్లు తీసివేస్తాడు. "ముద్దు పెట్టుకొంటూ అట్లా కళ్ళెందుకు మూసుకొంటారు?" అని చాలాసార్లు విసుక్కొంటుంది అతని భార్య.

ఇంటి బయట, మూలగా నున్న గదిలో - చలనం లేని వస్తువులా వాళ్ళ అమ్మే. ఆవిడకు ఇష్టం లేకపోయినా బలవంతంగా ఈ నగరపు అడవిలోకి లాక్కు వచ్చాడు. పల్లెల్లో గొడవలు, కొట్లాటలు. "అయితే ఏంటంటా?" ముసలమ్మ విసుగ్గా అరుస్తుంది. కొట్లాటలు, తగాదాలు, దెబ్బలు, నెత్తురు, పోలీసులు, కోర్టులు. "అయితే ఏంది? అయ్యి చూసి భయపడి పారిపొమ్మంటావా?" అని నసుగుతుంది. "నీకు పదేళ్ళప్పుడు నీ నాయన పొయ్యాడు. ఈ నలభైయేళ్ళు లేని బయ్యం, యిప్పుడేమొచ్చింది నాకు" అని కూడా అంటుంది. ఆమె కుడిచెయ్యి సగానికి తెగి, భుజంపై నుండి వ్రేలాడుతుంది. ఎర్రగా రక్తం కారుతూ, ఈగలు మూగి - ఈ కల రావటం మొదలు బెట్టినాకే వాళ్ళమ్మను సిటీకి తీసుకొచ్చాడు.

సమయం ఎనిమిదిన్నర. "ఆఫీసుకు వెళ్ళరా?" సుశీల గది బయట నుంచి అరిచింది. సమాధానం ఇవ్వలేదు అతను. "కాస్త లేచి అట్లా హాస్పిటల్ కన్నా పోయి, ఆ పిల్లకెట్లా ఉందో చూసి రాకూడదూ?" దానికీ సమాధానం ఇవ్వలేదు. "టేబుల్‌పై అన్నీ సర్ది ఉంచాను. అన్నంతిని వెళ్ళండి. ఆఫీసుకు" అంటూ ఆవిడ ఇంట్లోంచి నిష్క్రమించింది. గంట ప్రయాణం చేయాలి ఆవిడ. మెహదీపట్నంలో ఆవిడ ఆఫీసు.

రెండో గదిలో కూడా హడావుడి వచ్చింది. అయితే రోజుట్లా ఆ గదిలో చప్పుళ్ళు, కేకలు లేవు. మూకీ సినిమా సాగుతుంది. కొడుకు నిట్‌కి కాబోలు బయలుదేరాడు. "కంప్యూటర్ భాషలు, ఇదో కొత్తమతం. రా బాప్తీసమిస్తా." నంటూ చాలాసార్లు సత్యప్రకాశాన్ని విసిగించాడతను. అతని అడుగులు విన్పిస్తున్నాయి. హీరో హోండా చప్పుడు బుర్రుమంటూ వినిపించింది. సో. రెండో మనిషి కూడా నిష్క్రమించాడు.

బయట మూలగదిలోంచి టప్, టప్ మంటూ చప్పుడు. వాళ్ళ అమ్మే. నిద్రపోతూ, నిద్రపోతూ మధ్యలో మంచంపై నుంచి లేచి, పాత చెప్పు తీసుకొని టప్‌టప్‌మని నేలపై కొడుతుంది. అసంకల్పితమైన అలవాటు ఆమెకు. బీడు పడ్డ నేలలు - తేళ్ళు పాములు ప్రాకే నేలలు. పొలంలోనే ఇళ్ళు వేసుకొని సాగు చేశారా నేలల్ని. చిన్నప్పుడు మంచం పక్కన దుడ్డుకర్ర, పక్క క్రింద

తేలుమందు పెట్టుకొని పడుకొనేవాళ్ళు. అతను నిద్రపోతుంటే మంచం పక్కనే కూర్చుని - పాత చెప్పుతో టప్‌టప్‌మంటూ తేలు పిల్లల్ని చంపుతూ కూర్చొనేది. అట్లా రాత్రంతా మేలుకొనే ఉండేది. ఇప్పటికీ ఆ అలవాటు ఒక అసంకల్పిత చర్యలా ఆవిణ్ణి అంటిపెట్టుకొని ఉంది.

టప్ టప్ శబ్దం ఆగింది. బయటకు వెళ్ళి ఉంటుంది వాళ్ళ అమ్మ. అట్టా కాసేపు బయట తిరగాలని ఆవిడ కోరిక. ఎదురు వీధిలో పాలు పోసేవాళ్ళ దగ్గరకు, పార్కు దగ్గరకు వెళ్ళి ఉంటుంది.

సమయం, తొమ్మిది. ఇల్లంతా ఖాళీగా చప్పుడు లేకుండా ఉంది. గదిలో ఇంకా తలుపులు, కిటికీలు మూసే ఉన్నాయి. అతని ఉనికిని, ఆలోచనల్ని పసిగట్టేవాళ్ళు ఎవరూ లేరని నిర్ణయించుకొన్నాక - సొరుగు తీసి గాజు సీసా బయటకు తీశాడు. "ఉహూ! ముందు మోహిని గురించి జ్ఞాపకాల్ని బయటకు తీయటం న్యాయం" అనుకొన్నాడు.

సత్యప్రకాశంలో కొత్తగా మొలుచుకొచ్చిన లైంగిక స్వప్నం మోహిని. "నన్ను ముద్దాడండి! నా కళ్ళు నీలాలై, నేనొక ద్రవాన్నై పోయేదాక ముద్దా డండి. రా! నా చేతుల్లో, నా ముఖంలో, నా స్వేదంలో, నా ఆకలిలో, నా కోరికలో అంతటా కలిసిపో?" అని అతన్ని కవ్వించే ఇరవై అయిదేళ్ళ మోహినిలో గొప్ప ఉద్వేగం, ఉత్సాహం!

సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం ముచ్చట. శుభోదయం పత్రికను పెట్టాలని, ఒక డబ్బున్న ఆసామి అనుకొన్నప్పుడు, రిటైరైన పెద్ద ఎడిటరు, సత్యప్రకాశంతో పాటు నలుగురు పేర్లు ఆసామికి రికమెండ్ చేశాడు. ఆసామికి 'మోహిని' పేరూ, మనిషీ బాగా నచ్చాయి. మోహినిని వర్కింగ్ ఎడిటర్‌గా పెట్టి పత్రికను మొదలుపెట్టాడు. మిగిలిన వాళ్ళు సబ్‌లుగా ఉండిపొయ్యారు. మోహినికి షాడోగా ఉండిపోవటం మంటగా ఉండేది సత్యప్రకాశంకి. మోహిని అద్భుతాలు చేసే మనిషి. మామూలు వార్తను కూడా అందమైన కథలా చెప్పగల నేర్పు ఉంది. మూడు సంచికలు వస్తే గొప్ప అనుకొన్న శుభోదయం, ఈ మధ్యనే మూడో వార్షికోత్సవం జరుపుకొంది. "మసాల ఎక్కువ వేసింది! అందుకే క్లిక్కయింది." అనేవాడు సత్యప్రకాశం కొత్తలో. మెహిందీ బజారు. మీట్ యువర్ సైక్రియాటిస్ట్, ఈ వారం ఫోటో, కల చెప్పండి, భవిష్యత్తు తెలుసుకోండి, రోగ్స్ గాలరీ - చాలా శీర్షికలు పెట్టింది మోహిని. నాన్సీ ఫ్రైడే రాసిన 'మై మదర్ మై సెల్ఫ్' అనే లైంగిక ఫాంటసీల పుస్తకం తెలుగు అనువాదం వెయ్యి టంతో శుభోదయం లక్ష కాపీలు దాటింది. మోహిని తిరుగులేని ఎడిటోరియల్ స్టార్‌గా మారిపోయింది.

మొదట్లో మోహిని అంటే సత్యప్రకాశ్‌కు చాలా భయం. మోహినే కాదు, ఆధునిక స్త్రీ ఎవరయినా అతనికి భయం కలిగిస్తారు. వాళ్ళ నిర్భయత్వం, సెక్స్ గురించి ఎడాపెడా మాట్లాడటం అతనికి నచ్చవు. అతని లైంగిక సమయాలు చాలా మౌనంగా గడిచిపోతాయి. ఒక తప్పనిసరి అనుభవంగా ముగుస్తుంది. ఆ అనుభవమూ ఆత్మను అంటదు. మోహిని హఠాత్తుగా ఆర్గానిజం గురించి మాట్లాడుతుంది. మగవాళ్ళలో కనబడే ఫార్టీ యియర్స్ సిండ్రోమ్ గురించి మాట్లాడుతుంది. ఇదంతా కంపరంగా ఉండేది సత్యప్రకాశంకి క్రమంగా, ఆ మాటలు వింత హాయిని, ఎరోటిక్ ఆనందాన్ని కలిగించటం మొదలు పెట్టాయి. మోహిని పక్కనే ఉంటే 'కాంపోజ్' మాత్ర వేసుకొన్నంత హాయి కలగటం కూడా అతను గమనించాడు.

"ఈ యిరానీ టీ హోటళ్ళు, సాంస్కృతిక మేళాల్లాంటివి. ఎంత సందడి. రోడ్డుపై వందలాదిగా రంగుల కలల్ని వలకబోస్తున్నట్లుగా – 'అరె యార్ కైసా హై తూ? వో చోక్రీ బహుత్.... ఆజ్ ఘర్‌మే చావల్ నహీ... ఆడుపెద్ద గూండా గురూ!... మస్తు సినిమా! ఏం ఫాయిదా లేదు...' ఈ ఉర్దూ పదాల్ని ఆ మనుషుల హడావుడిని చూస్తుంటే 'ఫెల్లిని' సినిమా చూస్తున్నంత థ్రిల్‌గా ఉంటుంది."

ఆఫీసుకు వస్తూనే గలగలమంటూ వస్తుంది మోహిని. అప్పటికే ఆఫీసుకు వచ్చేసిన సత్యప్రకాశం దిగులుగా కూర్చొని ఉంటాడు. ఎప్పటిలాగే ఆ రాత్రి వచ్చిన కలల్ని నెమరువేసుకొంటూ.

"సత్యా! హలో ప్రకాశం! ఏమిటలా, దిగులుగా, ఆత్మగృహంలో బాంబులేమయినా పేలాయా?" అంటూ పలకరిస్తుంది.

ప్రకాశం ఉలిక్కిపడతాడు. రాత్రి అతని నిద్ర కలలో బాంబులు పడటంతో మొదలైంది.

"ఐ హాడ్ ఏ డ్రీమ్..."

"నాకు ఉరిశిక్ష పడింది అన్నట్లుగా అట్లా దిగులుగా చెబుతున్నావు – తలుపు తెరిస్తే చాలు బయటకు తోసుకు రావాలనే కలలు నాకూ చాలా ఉన్నాయి. డ్రీమ్ ఈజ్ ది హైయెస్ట్ పాయింట్ ఆఫ్ లైఫ్ అంటాడు బెన్ ఓక్రీ, నైజీరియన్ కవి".

"ఇది మరణ వాఙ్మూలంలాంటి కల!" సత్యప్రకాశం గొంతులో దుఃఖపు జీర.

"ఎవరి మరణం?"

"పూర్తిగా విను!" అంటూ ఒక గంటసేపు అతని కలల బీభత్సాన్ని గురించి చెబుతాడు.

కలంతా విని "నువ్వో సైకియాట్రిస్ట్‌ని కలవరాదూ?" అంటుంది. పోనీ మన కాలమిస్టు డా॥ మోహనసుందరాన్ని చూద్దామా?" అంటుంది.

ఆ మాట విని ఎందుకో బిగుసుకుపోతాడు సత్యప్రకాశం. అతనికి సైకియాట్రిస్ట్‌లంటే భయం.

ఇంకో రోజు, టీ మరకలు, సిగరెట్టు పొగలు, నేలపై ఆడుకొనే కాగితాలు, చాలామంది మనుషులు క్రిక్కిరిసినట్లుండే ఆఫీసులోకి అందమైన సముద్రపక్షిలా వచ్చి వాలేది. వస్తూనే బద్ధకంగా కూర్చున్న సత్యప్రకాశం పక్కన చేరి, "సూర్యోదయాల్ని, పక్షుల పాటల్ని నా ఒంటినిండా అద్దుకొని వచ్చాను. నా శరీరాన్ని ఎక్కడయినా ముట్టుకో. గొప్ప థ్రిల్ కలుగుతుంది!" అనేది. కంగారు పడేవాడు సత్యప్రకాశం. ఈ శరీరపు భాష, ఈ థ్రిల్ అతనికి అర్థం అయేవి కావు. అమె వైపు నిర్లిప్తంగా, బద్ధకంగా అట్లాగే చూస్తూ ఉంటాడు. "బయట వీధిలో ఒక ముస్లిమ్ కుర్రాడు నిలబడి ఉంటాడు. ఇంటి దగ్గర నుంచి నన్ను ఫాలో అవుతున్నాడు. ఇక్కడదాకా వచ్చినాక, నా దగ్గరికి వచ్చి ఉర్దూలో ఒక పోయమ్ చెప్పి, ఒంటిచేత్తో స్టైల్‌గా అభివాదం చేశాడు. ఆ ఉర్దూ పద్యం అర్థం ఏమిటో తెలుసా 'నువ్వో సముద్రానివి. అదీ పున్నమి రాత్రుల్లో పోటెక్కిన సముద్రానివి! క్వేక్ క్వేక్ అంటూ లోపల వందలాది పక్షులు రెపరెపలాడుతున్నాయి. నీ శరీరాన్ని ముట్టుకొంటే తట్టుకోలేని శబ్దాలు. ఆ శబ్దాల హాయికి ఏ మగవాడైనా ఇట్టే చచ్చిపోతాడు. అందుకే దూరం నుంచి సలాం చేసి వెళుతున్నాను' అని, దూరం నుంచే సలాంచేసి వెళ్ళిపోయాడు. ఆ ముట్టుకొనే ఛాన్స్ నీకిస్తున్నాను. రా!" అనేది మోహిని కవ్విస్తూ. ఒక్కోసారి మోహినికి కోపంవస్తే "అంకుల్" అంటూ పిలిచేది. ఆ రోజంతా ముడుచుకొని ఉండేవాడు.

సరిగ్గా సంవత్సరం క్రితం మోహినికి ఏక్సిడెంట్ అయ్యింది. ఆ ఏక్సిడెంట్ సత్యప్రకాశం, మోహిని సంబంధాల్లో గొప్ప మలుపు తెచ్చింది. మోహిని నడిపే కైనెటిక్ హోండా ఒక జీపును గుద్దింది. మోహిని వెల్లకిలా రోడ్డుపై పడింది. పక్కటెముకలు విరిగి పైకి లేవలేని స్థితి. ఆ వెనకే వస్తున్న సత్యప్రకాశం. మోహినిని రెండు చేతుల్తో ఎత్తుకొని హాస్పటల్‌కు చేర్చాడు. దాదాపు రెండు వారాలు మోహినికి సపర్యలు చేశాడు. డ్రస్సింగ్ చేయటం, అన్నం తినిపించటం. సత్యప్రకాశంలో ఇంత కరుణగల మానవుడున్నాడా అని ఆశ్చర్యపోయేలా సేవ చేశాడు.

డిశ్చార్జి అయి తన ఫ్లాట్‌కు వచ్చిన రెండోరోజు రాత్రి సన్నటి దీపంలా వెలుగుతున్న వేళ, నీరు నిండిన కళ్ళతో థ్యాంక్స్ చెప్పింది మోహిని. హఠాత్తుగా

పైకి లేచి, గొప్ప నాట్య భంగిమలో నిలబడి, శరీరంపైని చీరని, బ్లౌజుని ఒక్కొక్కటి క్రిందకు జార్చి, మౌనంగా, నగ్నంగా మారి అద్భుతమైన 'బ్యాలే డాన్సు' చేసింది. అదొక అద్భుతం, అదొక ఉత్సవం. తన శరీరాన్ని, సౌందర్యాన్ని ఒక భంగిమగా మార్చి అతనికి అర్పించింది. నా ప్రేమ ఇదుగో, అందుకో అంటూ అతని చేతుల్లో ఇమిడిపోయింది.

అది తొమ్మిదినెలల క్రితం ముచ్చట.

అక్టోబరు తొమ్మిది, అతను తన చావును కలగన్న రోజున, ఉదయాన్నే మోహిని ఫోన్ చేసి న్యూ సిటీ హాస్పటల్‌కి రమ్మంది. సత్యప్రకాశ్ గుండెల్లో భయం. ఆందోళన. "రెండు నెలలు నుంచి పీరియడ్స్ రావటం లేదు. ఇదుగో ఇప్పుడే డాక్టరు కన్‌ఫర్మ్ చేసింది. మనకో పిల్లాడు పుడుతున్నాడు" అంది ఆనందంగా. సత్యప్రకాశం గొంతులో తడి ఆరిపోయింది.

"ఎట్లా జరిగింది? మాత్రలేవో వాడుతున్నావుగా" అన్నాడు నంగిరిగా.

"వాడుతున్నాను. కానీ ఈమధ్యనే ఎందుకో ఆపేయాలనుకొన్నాను. అమ్మను కావాలనిపించింది!".

"కానీ... నో... వీల్లేదు!" భయంగానే కానీ పెద్దగా అరిచాడు.

"ఏం?" నవ్వుతూ రెట్టించింది.

"నలుగురికి తెలిస్తే బాగుండదు. నీ భవిష్యత్తు ఏమవుతుంది?"

"నా వర్తమానం, భవిష్యత్తు నువ్వే కదా" సందేహంగానే అంది మోహిని. మోహిని కళ్ళల్లో ఆశ, అభ్యర్థన. సత్యప్రకాశం నరాల్లో భయపు విషం.

"నో వీల్లేదు. వీల్లేదు" హాస్పటల్ అని కూడా చూడకుండా పెద్దగా అరిచాడు. ఒక ఉన్మాదిలా అక్కడి నుంచి పారిపోతూ.

అక్టోబరు పది, ప్రభాకర్ అనే కుర్రాడిని, ఆఫీసు ముందరే దారుణంగా కాల్చి చంపారు. శుభోదయంలో అతడు చేరి నెల కూడా కాలేదు. తలలోంచి దూసుకుపోయింది గుండు. ఎర్రగా, జిగటగా మెట్ల దగ్గరే పడింది బులెట్. అతని చేతిలోని కాగితాలు చెల్లాచెదరైనాయి. కార్ల అద్దాలపై, గోడలపై పిచికారీలా రక్తం. తల చిట్లిపోయి, రక్తం ధారలు కట్టిన ప్రభాకర్ ముఖం చాలా రోజుల నుంచి కలలో వచ్చి వెంటాడేది సత్యప్రకాశాన్ని.

బ్లాక్ బ్యాడ్జీలు, ధర్నాలు మోహిని పెద్ద ఎత్తున గొడవ లేవదీసింది.

సాయంకాలం ఆరుకు శవాన్ని మార్చురీ నుంచి బయటకు తెచ్చారు. అచ్చం సత్యప్రకాశం కలల్లోలాగే తెగిన చేతులు, వేళ్ళాడుతున్న తల. ప్రకాశం బెదిరిపోయాడు.

సంస్మరణ సభలో మోహిని చాలాసేపు మాట్లాడింది. అందులో 'సామూహిక నిశ్శబ్దం', 'ఎదురౌతున్న మరణం' అనే రెండు మాటలు మాత్రం

సత్యప్రకాశం గుండెలకు కొక్కాలుగా తగులుకొన్నాయి. తలలోంచి దూరి రెండోవైపుకు ప్రయాణిస్తూ.

మీటింగ్ చివరలో ఎవరో ఉద్యమపాట పాడారు. "బ్రతికినంత కాలం ఇట్లా పొగిలి పొగిలి ఏడుద్దామా?" అనే అర్థం వచ్చే పాట. గుండె గుబులు గుబులుగా అనిపించింది. కళ్ళ ముందు భయానకమైన అరుపు, రక్తం చిమ్మిన దృశ్యం, ప్రభాకర్ కరచాలనం చేస్తున్నట్లు, అతనితో సంభాషిస్తున్నట్లు - మీటింగ్‌లో ఉండలేకపొయ్యాడు.

గంట తరువాత మోహిని ఫోను. "మీటింగ్ నుంచి పారిపోయి వచ్చావా? మరణం కన్నా హీనంగా బ్రతకొద్దు ప్రకాశం."

మరో గంట తరువాత ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా, యమ్.డి. ఇంటికి వెళ్ళాడు.

పైన ఆకాశం నల్లగా, పెద్ద కళేబరంలా ఉంది.

అక్టోబరు పన్నెండు. పదిగంటల సమయంలో, ఎప్పటిలా సెల యేరులా ప్రవహిస్తూ ఆఫీసుకు వచ్చింది మోహిని. కొత్త వాతావరణం ఎదురైంది. ఎడిటర్ రూము ముందు మోహిని నేమ్‌ప్లేట్ తొలగించబడింది. లోపల సీటుపై సరికొత్త సఫారీ సూటులో సత్యప్రకాశం, కొత్తగా - దర్పంగా "రా. ఈ వారం అంతా సెలవు పెట్టావట గదా" అన్నాడు మెత్తగా, భయంగా. "ఈ విషయం నీకు అప్పుడే చెప్పగూడదనుకొన్నాను. మేనేజింగ్ డైరెక్టరు, కొత్త ఎడిటర్ని అప్పాయింట్ చేశారు. పత్రిక స్టేల్ అయిపోతుందని, సర్క్యులేషన్ పడి పోతుం దని..." నంగిరి నంగిరిగా సత్యప్రకాశం.

"ఎవర్ని కొత్తగా ఎప్పాయింట్ చేసింది?" అరుస్తున్నట్లుగా అడిగింది. "నువ్వా?" అంది ఆపుకోలేని నవ్వుతో. "తప్పుల్లేకుండా తెలుగు ప్రోజ్ రాయలేవు. తెలుగు మాగజైన్ తప్ప కనీసం లైఫ్ మాగజైన్ కూడా చదవనివాడివి" నవ్వు తూనే ఉంది మోహిని.

సత్యప్రకాశం కోపం తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. కానీ ధైర్యం చాలలేదు. "జ్యోతిలో ఏదన్నా వేకెన్సీ ఉందేమో ట్రై చేద్దాం." సీరియస్‌గా మారిపోయింది మోహిని. "కావాలంటే ఇట్లాంటివి లక్ష ఉద్యోగాలు సంపాదిం చుకోగలను. నాకు జీవితం ఒక ఛాలెంజ్" అంటూ పొగరుగా, బయటకు వెళ్ళింది.

అక్టోబరు పదమూడు. అంటే నిన్న. మోహిని దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. "యమ్.డి.ని ఇవ్వాళ కలిశాను" అంది. చాలాసేపు మౌనం... "కేరెక్టరు అంటే ఏమిటో తెలుసా నీకు? పోనీ కేరెక్టరు లేకపోవటం అంటే అయినా

తెలుసా? రెండోదానికి సజీవ ఉదాహరణ నువ్వు. డర్టీ పిగ్. అపాత్రదానం చేశాను. సాయంకాలం న్యూసిటీ హాస్పటల్‌లోనే అబార్షన్ చేయించుకొంటున్నాను. నీ జ్ఞాపకాల్ని నాలోంచి వేళ్ళతో సహా పీకేయించుకొంటున్నాను" క్లిక్ మన్న ఫోన్ చప్పుడు.

మోహిని జ్ఞాపకాలు ముగిశాయి.

సమయం తొమ్మిదిన్నర. చీకటి కాని చీకటి. బయటంతా పగటి ఎండ. తలుపులు, కిటికీలు మరోసారి లాగి చూశాడు సత్యప్రకాశం. వణుకుతున్న చేతుల్తో సొరుగు తీశాడు. ముఖంలో చెప్పలేని ఉద్వేగం. భయం. దూది, గాజు గుడ్డలో చుట్టిన మూటను బయటకు తీశాడు. వింత వాసనేదో గుప్పు మంది. నిన్న సాయంకాలం న్యూ సిటీ హాస్పటల్ నుంచి తెచ్చుకొన్నది. నర్సు ముందు ఒప్పుకోలేదు. ఐదు వందల నోట్లు ఇస్తే గానీ ఇవ్వలేదు. "ఏం చేస్తావు?" నర్సు ఆశ్చర్యానికి, ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

రెండు చేతుల్లోకి తీసుకొన్నాడు. చచ్చిపోయిన ఫీటస్. ఇంకా ఆకారం రూపుదాల్చుకోలేదు.

గాజుసీసాలో పసుపుపచ్చ రంగులో ఫార్మాల్డిహైడ్. అందులోకి మూడు నెలల నిర్జీవ మానవరూపాన్ని జారవిడిచాడు.

ఎదురుగా ఫార్మాల్డిహైడ్‌లో తేలుతూ మృత పిండం. వింత ఆనంద మేదో కలిగింది సత్యప్రకాశానికి. పెద్దగా నవ్వాలనుకొన్నాడు. ఎందుకో నవ్వు రాలేదు. చూస్తుండగానే లోపలి ఏదో తెగి, తుఫానులాగా.... డెడ్ ఫీటస్‌కు ఎదురుగా కూలబడి వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టాడు.

అట్లా ఏడుస్తూనే ఉన్నాడు సత్యప్రకాశం.

సమయం పది, పదిన్నర, పదకొండు, పదకొండున్నర...

*– ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 13-11-1998*